

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కత్తి వెంకటస్వామి

ప్రైవేట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నల్లకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులకు 12 నెలల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేయాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కత్తి వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. గెస్ట్ లెక్చరర్స్ వేతనాలు వెంటనే విడుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సోమవారం తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎయిడెడ్, మోడల్ స్కూల్స్ అధ్యాపకుల జీతాలు, రెగ్యులరైజ్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ సర్వీస్ సమస్యలను పరిష్కరించాలన్నారు. బీఈడీ లెక్చరర్స్ రిక్రూట్‌మెంట్ తెలంగాణ లోకల్ అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రామకృష్ణయ్య, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, చుక్క సైదులు, ఫరీద్, అరుణ్, మార్కండేయ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతులను దహనం చేస్తున్న సాగర్, పశ్యపద్మ తదితరులు

కేంద్ర వ్యవసాయ మార్కెట్ విధానం ప్రతుల దహనం

చిక్కడపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో కేంద్ర వ్యవసాయ మార్కెట్ విధానం ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, విస్సాకిరణ్, బి.రాము, వస్కుల మల్లయ్య ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మార్కెట్ చట్టాలను రాష్ట్రంలో రూపొందించుకుంటే మద్దతు తెలుపుతామని కేంద్రం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం తన వైఖరిని మార్చుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికసంఘాల నాయకులు పాలడుగు భాస్కర్, ఎస్వి రమ, ప్రసాద్, మూడ్ శోభన్, నాగరాజు, పద్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

'తెలంగాణలోని ఒక జిల్లాకు పీవీ పేరు పెట్టాలి'

నల్లకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా, ప్రధానమంత్రిగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారని గుర్తు చేశారు. సోమవారం నల్లకుంటలోని సమితి కార్యాలయంలో పీవీ జిల్లా సాధన సమితి, బ్రాహ్మణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పీవీ వర్ధంతి నిర్వహించారు. ముందుగా సమితి నల్లకుంట కార్యాలయంలో పీవీ చిత్రపటానికి, అనంతరం నాగల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణారావు మాట్లాడుతూ పీవీ పేరును ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు దేశ్‌ముఖ్ రమాకుమార్, కోశాధికారి మంత్రి సునీల్, ప్రముఖ న్యాయవాది కానాల శ్యాంసుందరరావు, గూడా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

'బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలి'

నల్లకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. పార్టీ ఆదేశానుసారం బూత్ కమిటీలను నల్లకుంట డివిజన్‌లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్‌లోని బూత్ 91 అధ్యక్షుడుగా సాయికుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందజేసి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో పార్టీ బలమైన శక్తిగా అవతరించాలని కోరారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి బి.సురేష్‌యాదవ్, డివిజన్ కన్వీనర్ కే.బీ.నర్సింగ్‌రావు, అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కృష్ణగౌడ్, సుధాకర్, సాయి, వరుణ్, రాజేష్ పాల్గొన్నారు.

'కనీస వేతనాల సలహామండలిలో అన్ని సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలి'

చిక్కడపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల సలహా మండలిలో రాష్ట్రంలోని అన్ని కార్మిక సంఘాలకూ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోటిమందికిపైగా కార్మికులకు కార్మికసంఘాలు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యలపై అనేక ఆందోళన, పోరాట కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్న సంఘాలన్నింటికీ కనీసవేతనాల సలహామండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేత బాల్‌రాజ్, బీఆర్‌టీయూ నాయకుడు రాంబాబుయాదవ్, టీయూసీఐ నేత కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ నేత శివబాబు, అంజాద్, నారాయణ, రాములు, వివిఎస్‌రావు, చంద్రశేఖర్, రమేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బీబీడీ, రాంనగర్, తాళ్లబస్తీ, ఎర్రమంజిల్ 11 కేవీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నల్లకుంట పరిధిలో 11.30 నుంచి 1.30 గంటల వరకు, విద్యానగర్, గుల్షన్‌నగర్, సెవెన్ టెంపుల్, కేర్ ఆస్పత్రి పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సోమవారం సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. నిలిచిపోయిన రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు, నూతన రోడ్డు నిర్మాణం డివిజన్‌లోని పార్కుల సుందరీకరణ, స్ట్రీట్ లైట్ల క్రమబద్ధీకరణ పనులు పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరినట్టు వివరించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణన్

చిక్కడపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని బీఎంఎస్ అఖిల భారత కార్యదర్శి వేలు రాధాకృష్ణన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ మజ్దూర్ మహాసంఘ్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాధాకృష్ణన్ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షుడు రంగారావు, బీఎంఎస్ సీనియర్ నేత వెంకటేశం, ఆలిండియా కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు కేవీ రాధాకృష్ణన్, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఎ. శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా తవ్వకాలు

● నిత్యం ట్రాఫిక్ అవస్థలు



బర్కత్‌పుర చౌరస్తా వద్ద రోడ్డుపై మట్టికుప్పలు

బర్కత్‌పుర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరదనీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసి మట్టిని రోడ్డు పక్కన కుప్పలుగా పోశాడు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పైపులైన్ పనులు ప్రారంభించి 45 రోజులు గడచినా పూర్తికాకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి కాచిగూడ డివిజన్ బర్కత్‌పుర చౌరస్తా నుంచి నారాయణగూడ ఫ్లై ఓవర్‌కు వెళ్లే మార్గంలో పరిస్థితి. తెలంగాణ యువతి మండలి చౌరస్తా నుంచి నారాయణగూడ ఫ్లై ఓవర్ బాగ్‌లింగంపల్లి చౌరస్తా వరకు రూ. 47 లక్షల వ్యయంతో గత నెల 13న వరదనీటి కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పను లు ప్రారంభించారు. మరుసటి రోజు నుంచి పైప్‌లైన్ల కోసం తవ్వకాలు ప్రారంభించి మట్టికుప్పలను రోడ్డుకిరువైపులా పోశారు. ప్రధాన రహదారి కావడం వాహనాల రద్దీ విపరీతంగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. మెహిదీపట్నం, కూకట్‌పల్లి, అమీర్‌పేట, పటాన్‌చెరుకు వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఈ రోడ్డుగుండానే వెళ్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు విపరీతంగా రద్దీగా ఉంటుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పైప్‌లైన్‌లు వేసి మట్టి కుప్పలను రోడ్డుపై వదిలేశాడు. ఈ రహదారిలోనే శ్యామలాదేవి బాలికల ఎయిడెడ్ పాఠశాల, డిగ్రీ కళాశాల, హైందవి డిగ్రీ, పీజీ కళాశాలలున్నాయి. ఈ మట్టికుప్పల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి పక్కనే రాఘవేంద్రస్వామి మఠం ఉంది. మఠానికి వచ్చే భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు నడిరోడ్డుపై నిలుపుతుండడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వరదనీటి కాలువ పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేసి మట్టికుప్పలను తరలించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగా నిర్మాత అంబేద్కర్‌ను కించపరిచే విధంగా పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఎం అనిల్‌కుమార్‌యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాల్లో అమిత్‌షా బీఆర్ అంబేడ్కర్ పై చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ముషీరాబాద్ నియోజకవర్గం ఏ అండ్ బి బ్లాక్ అధ్యక్షుడు విడి కృష్ణ, అంజియాదవ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మొదట దోమలగూడ గగన్‌మహల్ ఏవీ కళాశాల భగత్ సింగ్ విగ్రహం నుంచి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు తరలివచ్చారు.

రెవెన్యూ అధికారుల హైదరాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక



హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

రాంనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహులు, రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, రాష్ట్ర వీఆర్‌వో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రయ్యలు ఈ కమిటీని ప్రకటించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడుగా కొంపల్లి విజయరావు, ప్రధాన కార్యదర్శిగా టి.రాములు, కోశాధికారిగా వర్కాల గణేష్, అసోసియేట్ అధ్యక్షుడుగా పేరుమల్ల విజయ్‌కుమార్, కృష్ణమారే, ఉపాధ్యక్షులుగా సైని శ్రీరాములు, మహాలక్ష్మి, పెబ్బేటి ఉపన్న, కార్యదర్శులుగా కాపరవేని రాజు, స్వామి, మహబూబ్‌ఖాన్, అజర్‌ఖాన్, పులి శివరాం, ప్రచార కార్యదర్శులుగా కొర్రావత్ అనిల్, సుజాత, సభ్యులుగా ఎం.ఎ.సలీం, ఓంప్రకాష్‌లు ఏకగ్రీవంగా నియమితులైనట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సంఘం సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న తమను ఎన్నుకున్నందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాచిగూడ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్‌యాదవ్



ప్రేమ్‌కుమార్‌యాదవ్‌కు నియామక పత్రం ఇస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ 205 బద్రుకా కాలేజ్ బూత్ కమిటీ అధ్యక్షుడుగా ప్రేమ్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. సోమవారం ఆయనకు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడానికి బూత్ కమిటీలు ఉపయోగపడతాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, చిట్టబోయిన నందకిషోర్‌యాదవ్, బుచ్చిరెడ్డి, కృష్ణకుమార్, క్షీరసాగర్, సుభాష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో వైద్యులు అందుబాటులో ఉండాలి

కాచిగూడ డివిజన్ మౌలానా ఆజాద్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలో 20 రోజులుగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆరోపించారు. సోమవారం బస్తీ దవాఖానాను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఎంవో డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి విషయం తెలిపినట్లు ఆమె తెలిపారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ పాలన: ఎంపీ లక్ష్మణ్



ఎం.నవీన్‌గౌడ్‌ను సన్మానించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ డా.కె.లక్ష్మణ్‌ను కలిసి ముషీరాబాద్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజా సమస్యలను పక్కనపెట్టి విమర్శలకు దిగుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్, నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్, బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్, నాయకులు మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంతర్గత రోడ్లను త్వరలో పూర్తి చేస్తాం

అంబర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అంతర్గత రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. డివిజన్‌లోని పటేల్‌నగర్‌లో రూ.13 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సుప్రసిద్ధ సినీ రచయిత బలిజేపల్లి



సమావేశంలో పాల్గొన్న సుబ్బారావు, జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బలిజేపల్లి లక్ష్మీకాంతకవి సినీ రచయితగా సుప్రసిద్ధులని ప్రముఖ సాహితీవేత్త పొత్తూరి సుబ్బారావు అన్నారు. ఆయన రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శిస్తూ ఉన్నారని వివరించారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంతకవి యాదిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు కీలకప్రసంగంలో భాగంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ గాంధీజీ పిలుపు మేరకు పాల్గొన్న లక్ష్మీకాంతకవి సినీ రంగంలోనూ కథారచయితగా నటుడుగానూ గుర్తింపు పొందారన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ మరుగున పడిపోతున్న బలిజేపల్లి లక్ష్మీకాంతకవి వంటి వారి గురించి తెలుసుకోవడం నేటి తరానికి ఎంతో అవసరమన్నారు. అందువల్లనే తెలుగుభాష దేశ సంస్కృతి సంప్రదాయాలు అవుతుందని వివరించారు. దివ్యాంగుల సంక్షేమసంఘం జాతీయ నాయకుడు నాగేశ్వరరావు, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎస్.కె.మహమ్మద్

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

రాంనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఎవరి సొత్తు కాదని, ఎంచుకున్న రంగంలో నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమ్మద్ పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో భాగంగా విద్యార్థులు పరిశోధనల వైపు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో టెక్ స్టార్మ్ 2024 పేరిట అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. జ్ఞానాన్ని పెంచుకున్నప్పుడే అది మన అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మంచి సంబంధాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అప్పుడే వారిలో నైపుణ్యాలు పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ప్రపంచవ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్‌రెడ్డి, ప్రొఫెసర్ డి.కరుణాకర్, ప్రొఫెసర్ ఎస్.కిషోర్‌కుమార్, ప్రొఫెసర్ కె.శ్యామల, జితేందర్‌సింగ్, శ్రీనివాస్, కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అప్పారావు, డాక్టర్ జి.రామచంద్రారెడ్డి, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'భువనేశ్వరి రచనలు నేటి సమాజానికి ఆదర్శం'

రాంనగర్,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రచనలు నేటి సమాజానికి ఆదర్శం అని రాష్ట్ర ఖనిజ శాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కళాభారతిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ టిక్కి కృష్ణ అధ్యక్షతన భువనేశ్వరి హిందీ అనువాద గ్రంథం గురువాంక గురు పుస్తకావిష్కరణ సభ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వి.డి.రాజగోపాల్, డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్‌లు మాట్లాడారు.

టీడీపీ సభ్యత్వ నమోదు టార్గెట్‌ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

రాంనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు నాయకులకు సూచించారు. సోమవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలలో టార్గెట్‌ను పూర్తి చేసి రాబోయే ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు రాజేష్, అశోక్, ఝాన్సీ ప్రమీల, శ్యాంసుందర్, రాజు, జగదీష్‌గౌడ్, విజయ్‌కుమార్, అనిల్, లాయిక్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణకు కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంఘాల నేతలు జిల్లపల్లి అంజి, మిరియాల యాదగిరి, నీల వెంకటేష్‌ల ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ పెట్టిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 29 నుంచి 50 శాతానికి పెంచాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, మరో 40 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు వేముల రామకృష్ణ, నంద గోపాల్, జి.అనంతయ్య, నిమ్మల వీరన్న, రాందేవ్ మోదీ, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ జవాన్ రాజుపై చర్యలు తీసుకోవాలి: శంకర్



కె.రాజు

రాంనగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ స్వీపర్లు, క్లాస్ ఫోర్ సిబ్బందిని బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న సర్కిల్ 29 శానిటరీ జవాన్ కె.రాజుపై చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు సోమవారం భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.శంకర్ పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కె.శంకర్ మాట్లాడుతూ శానిటరీ జవాన్ కె.రాజు తన విధులు నిర్వహించకుండా స్వీపర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీల్డ్‌లో ఉండి పని చేయాల్సిన రాజు.. ఉదయం 10.30 గంటల నుంచి జోనల్ కార్యాలయంలో ఉంటూ పైరవీలు చేస్తూ డబ్బులు దండుకుంటున్నారన్నారు. సర్కిల్ 29లోని 30 మంది ఉద్యోగులు, అధికారులను తన బ్లాక్‌మెయిల్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అతని అక్రమాల వల్ల స్వీపర్ ఇబ్బందులకు గురవుతున్నారని, అతని అవినీతి, అక్రమాలు, బ్లాక్‌మెయిల్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

జైలులో పరిచయం.. బయటకు వచ్చి దందా

- ● డ్రగ్స్ విక్రయిస్తున్న పాత నేరస్తులు
- ● ఇద్దరు పెడ్లర్లు, ఒక కొనుగోలుదారుడు అరెస్ట్
- ● రూ.3.35 లక్షల విలువైన మత్తు పదార్థం స్వాధీనం



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు డ్రగ్ పెడ్లర్లతో పాటు డ్రగ్స్ కొనుగోలుదారుడిని సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అంబర్‌పేటకు చెందిన సోలోమన్ సుశాయిరాజ్(33) డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు 2021లో స్థానికంగా గంజాయి కొనుగోలు చేయడంతో పాటు తన స్నేహితుడు అబ్బుతో కలిసి బెంగళూరు, గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి ఎండీఎంఏ, చరస్, ఎక్స్‌టసీ పిల్స్ కొని నగరంలో విక్రయిస్తున్నాడు. డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని అంబర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సోలోమన్ తిరిగి డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. డ్రగ్స్ విక్రయిస్తున్న సోలోమన్‌ను 2023లో ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలులో అతడికి గంజాయి కేసులో అరెస్టయిన గౌస్ పరిచయమయ్యాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు కలిసి డ్రగ్స్ దందా చేయడం ప్రారంభించారు. బెంగళూరులో డ్రగ్స్ విక్రేత నుంచి కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీలు కొనుగోలు చేసి వారు సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అంబర్‌పేట పోలీసులు కలిసి వీరిద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3.35 లక్షల విలువైన 6 గ్రాముల కొకైన్, 15 గ్రాముల ఎండీఎంఏ, 2 ఎల్ఎస్‌డీ బ్లాట్లు, డ్రగ్ సేవించే కిట్, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.